# నేనూ నాన్ననవుతా !

''మంజరీ! ఇప్పుడా రావడం?'' గద్దిస్తూ పలికింది బంటి కంఠం.

సురేష్ ఉలిక్కిపడి లేచాడు. 'ఈ బంటిగాడు మంజరిని పేరు పెట్టి ఎప్పటినుంచి పిలుస్తున్నాడూ' అనుకున్నాడు సురేష్ ఆశ్చర్యంగా.

ఏమైనా మంజరి వచ్చిందనగానే సురేష్‌కి ప్రాణం లేచొచ్చినట్లుగా వుంది. ఇందాకటినుంచి తలపగిలిపోతవా వుంది. ఓ టీ చుక్కకోసం తహతహలాడిపోతున్నాడు.

సురేష్ మంజరి అడుగుల శబ్దం కోసం చెవులు రిక్కించాడు.

''సారీ అండీ! బస్సు రావడం కాస్త...''

''ఆలస్యమైంది! అదేగా నువ్వు చెప్పబోయేది! విని విని నా చెవులు తుప్పుపట్టి పోయాయి గానీ ముందు నా మొహాన్న ఇన్ని టీ నీళ్లు పొయ్యి!''

తను అనవలసిన మాటలు బంటి కంఠంలోంచి వినిపించడంతో సురేష్ ఆశ్చర్యపోతూ, కిటికీలోంచి బయటకు చూశాడు.

బంటి ఓ పుస్తకాన్ని చేతిలో పట్టుకొని కుర్చీలో కూర్చొని వున్నాడు.

చైత్ర ఎదురుగా నిల్చునివుంది.

సురేష్ నీరసమంతా మాయమైంది. కిటికీ దగ్గర నిల్చుని, కుతూహలంగా వాళ్లవైపే చూస్తుండిపోయాడు.

''మొహాన్న ఏం ఖర్మ గొంతులోనే పోస్తాను!'' చైత్ర కోపంగా అంది.

''ఏయ్ చైత్రా... నువ్వు మమ్మీలా చేయడంలేదు! మమ్మీ ఏం మాట్లాడకుండా వెళ్లి టీ తెస్తుంది! ఇలా అయితే ఈ మమ్మీడాడీ ఆటనేనాడను!'' బంటి ఇంకా కోపంగా అన్నాడు.

''ఆడకపోతే పో! ఎప్పుడూ... నువ్వు తిట్టాలి! నేను తిట్లు తినాలి! కావాలంటే నేను డాడీనవుతా నువ్వు మమ్మీ వవ్వు!'' చైత్ర అంతకన్నా గట్టిగా అరిచింది.

''ఆడ పిల్లలెక్కడన్నా డాడీలవుతారా?'' బంటి వెక్కిరిస్తూ అన్నాడు, "ఈ ఆటలో నేనెప్పుడూ డాడీనే నువ్వు మమ్మీవే!''

బంటి కంఠంలో ఎంత ధీమా! ఎంతయినా తన కొడుకు కదా! సురేష్ ఆనందంగా అనుకున్నాడు.

''అదేం కాదు! నీ ప్లాన్ నాకు తెలీదనుకొన్నావా? ఎంచక్కా ఆ పుస్తకం ముందేసుకొని నాతో ఈ పజ్లన్నీ చేయించాలనే నువ్వెప్పుడూ డాడీవవుతావు! నన్నోసారి డాడీనవ్వనీ... అప్పుడు చెవుతా!'' చైత్ర బంటిని సవాలు చేస్తూ అంది.

సురేష్ అప్రయత్నంగా తన చేతిలోని పుస్తకాన్ని టేబుల్ మీద పడేశాడు.

అతని మనసుపొరల్లో దాగిన చిన్ననాటి జ్ఞాపకాలు కళ్లముందు కదలాడాయి. ఒకసారి తనూ హర్షిత ఇలానే తగువుకి దిగడం గుర్తొచ్చింది. హర్షితని ఏ విషయంలోనూ ఓ పట్టాన ఒప్పించలేం. వాదించి వాదించి చివరకు ఎలాగైనా తనే నెగ్గితీరుతుంది.

సురేష్‌కి బంటి, చైత్రల స్థానంలో తనూ హర్షిత కనిపిస్తున్నారు.

అమ్మ ఆరోజెందుకో బడినుంచి రావడానికి చాలా ఆలస్యమవుతుందని తామిద్దర్నీ ఇంటిదగ్గర వదిలి, చిరుతిళ్లిచ్చింది. బయటకెక్కడికీ వెళ్లొద్దని బతిమిలాడి హడావుడిగా బడికి వెళ్లిపోయింది. అమ్మ తమ బళ్లోనే టీచర్.

తనూ హర్షితా విసుగుపుట్టేదాకా ఇంట్లోనే ఆటలన్నీ ఆడారు. క్యారంబోర్డు ఆడుతుంటే తనకి అత్తయ్య వాళ్లు గుర్తుకు వచ్చారు. ఓసారి సెలవలకి వెళ్లినపుడు వాళ్లింట్లోనూ ఇదే ఆట ఆడారు, అయితే మామయ్య కూడా తమతో కలిసి ఆడాడు. ఎంత సరదాగా కలిసిపోయాడో! అత్తయ్య సంగతి సరేసరి. నాన్నలు ఎప్పుడైనా అలా నవ్వుతూ తుళ్లుతూ పిల్లలతో కలిసి ఆడడం తను అదే మొదటిసారి చూడడం.

''అయినా అతను మామయ్యకదా! నాన్న కాదుగా!'' అంటూ హర్షిత తేల్చి పారేసింది, తను ఎంతో సంబరంగా ఆ విషయం చెప్పినపుడు.

తను మళ్లీ హర్షితకు ఆ విషయం గుర్తుచేశాడు.

''పోనీ మనమే అమ్మానాన్నల ఆట ఆడదాం'' అంది హర్షిత.

ఆ ఆటంటే తనకీ హుషారే! తను నాన్నయితే ఎంచక్కా హర్షితని కోప్పడొచ్చు. పెద్ద పెద్ద కేకలెయ్యొచ్చు. చెడామడా వాయించేయచ్చు. అదేమిటీ ఇదేమిటీ అంటూ అన్నిటికీ పేర్లు పెడుతూ హర్షితను గిరికీలు కొట్టించవచ్చు. అందుకే వెంటనే ఒప్పేసుకున్నాడు.

తను నాన్నలా ఠీవీగా ఓ కుర్చీలో పేపర్ ముందు పెట్టుకొని కూర్చున్నాడు. హర్షిత వృత్తి టీ తీసుకొచ్చింది వినయంగా వంగి ఆ వుత్తుత్తి కప్పును జాగ్రత్తగా తనకు అందించింది.

తను నిర్లక్ష్యంగా కప్పును అందుకొన్నాడు. ఓగుక్క తాగినట్లుగా నటించి మొహం వెగటుగా పెట్టాడు.

''అదేంటండీ మొహమలా పెట్టారు? పంచదార చాల్లేదా?'' అదుర్దాగా అడిగింది హర్షిత.

''పంచదార చాలింది! కారమే ఎక్కువయ్యింది!'' అన్నాడు తను.

''అదేంటండీ అలా అంటారూ?'' హర్షిత నొచ్చుకుంటూ అంది. కానీ అమ్మ ఎప్పుడలా అన్నా ఆమె కళ్లల్లో నీటిపొర కనీకనిపించకుండా ప్రత్యక్షమవుతుంది. అయితే హర్షిత అలా చేయలేదు. ఆమె కళ్లెపుడూ నవ్వుతూ వుంటాయి. ఈ పూట హర్షితని ఎలాగైనా ఏడిపించాల్సిందే ననుకున్నాడు తను.

''ఊరంతా ఉద్ధరించడానికి నీకు బోలెడు ఓపిక! ఎటొచ్చీ నా మొహాన్న ఓ టీ చుక్కపోయడానికే తీరిక వుండదు!'' వెటకారంగా అన్నాడు తను.

హర్షిత అమ్మలానే వెక్కివెక్కి ఏడవడం మొదలెట్టింది. అది వుత్తుత్తి ఏడుపే. తను కోపంతో చిందులు తొక్కుతూ నాన్న విసిరినట్టే చేతిలోని కప్పును హర్షిత మొహాన విసిరికొట్టాడు. నిజానికి అప్పటికే తను ముప్పావు వంతు టీ ఖాళీ చేసేశాడు, నాన్నలాగే!

హర్షిత అమ్మలా మౌనంగా మొహం కొంగుతో తుడుచుకొని ''నన్ను క్షమించండి!'' అంటూ భోరున ఏడవలేదు. లేదా కొంగు మూతికడ్డం పెట్టుకొని కుళ్లికుళ్లి ఏడవలేదు. ''నేనీ ఆట ఆడనుపో!'' అంటూ ఎదురుతిరిగింది.

''ఏం? ఎందుకు ఆడవు? మధ్యలో ఆట ఆపితే నేను ఒప్పుకోను!''

''ఒప్పుకోకపోతే ఏం? రోజూ నువ్వు ఇలాగే నా మీద పెత్తనం చూపిస్తావు ఈ ఆట పేరు చెప్పి!'' హర్షిత ఉక్రోషంగా అంది.

హర్షిత తన ఆలోచనలని పసిగట్టేసింది. తను ఆ విషయం తేలిగ్గా కొట్టిపారేస్తూ, గట్టిగా తగువుకి దిగాడు. హర్షిత తనతో ధీటుగా వాదిస్తోంది.

తనను ఓసారి నాన్నగా ఆడనిస్తే అప్పుడు చెపుతానని సవాలు చేసింది హర్షిత. చివరకు ఒక షరతు మీద ఒప్పుకున్నాడు తను. హర్షితకి ఒక్కటే ఒక్క అవకాశం! ఆట మధ్యలో అమ్మానాన్న ఎవరు వచ్చినా ఆట ఆపెయ్యడమే. మళ్లీ ఇంకెప్పుడూ ఆడే ప్రశ్నే లేదు.

అన్నిటికీ సరేనంది హర్షిత. అయితే తనూ ఓ షరుతు పెట్టింది. హర్షిత నాన్నలాగ ఎలాగ చేస్తుందో తనెప్పుడూ అలాగే చెయ్యాలట! సరే చూద్దాం లెమ్మన్నాడు తను.

హర్షిత నాన్న అయ్యింది. తను అమ్మ.

మాకు చిన్న బొమ్మలు రెండున్నాయి. రాజు, శ్వేత! అవిప్పుడు హర్షిత, సురేష్‌లు అయ్యాయి.

హర్షిత హాయిగా నిద్రపోతున్నట్లుగా పడుకుంది. కళ్లు సగం తెరిచి తను అమ్మలా సరిగ్గా చేయగలుగుతున్నానో లేదోనని పరీక్షిస్తోంది.

తను చకచక తమ బొమ్మల టీసెట్టుతో టీ తయారు చేశాడు. హర్షితని మృదువుగా తట్టిలేపాడు. న్యూస్‌పేపర్ ఓ చేత్తో అందిస్తూ మరో చేత్తో టీ అందించాడు.

హర్షిత అరమోడ్పు కన్నులతో ఆవులిస్తూ టీ తాగాలి. నిర్లక్ష్యంగా పేపర్ అందుకొని, దానిని చేతిలో అలాగే పట్టుకుని, ఓ కునుకుతీయాలి.

కానీ హర్షిత చెంగున లేచి బాసింపట్టు వేసుకూర్చుంది.

''సారీ బాగా లేటయ్యింది! మరి నువ్వు టీ తెచ్చుకోలేదేం? పోనీలే.. దీంట్లో సగం నువ్వు తీసుకో'' అంటూ కప్పులోని టీ ఇంకొక కప్పులోకి వంచి ఇచ్చింది.

తను మౌనంగా అందుకున్నాడు.

''టీ చాలా బావుంది!'' హర్షిత టీ తాగుతూ అంది.

తనకి ఇంకా చాలా పనులున్నాయి. పిల్లలిద్దరినీ నిద్రలేపి బడికి తయారు చేయాలి. ఉదయపు టిఫిన్లు కాఫీలు చేయాలి. మధ్యాహ్నం క్యారియర్లు సర్దాలి. ఇల్లు శుభ్రంగా సర్దుకోవాలి. కొళాయి ఆగిపోయేలోగా నీళ్లు పట్టుకోవాలి. బడికి తయారు కావాలి. ఇలాంటివే బోలెడు పనులున్నాయి. చెల్లికేం నాన్న పాత్రలో వుంది. ఇక పేపర్ చదవడమే పని. అందుకే అంత నిదానంగా చెప్పగలుగుతోంది. తను కోపం తెచ్చుకోకూడదు. తను అమ్మ పాత్రలో వున్నాడుమరి!

తన మొహం మీద ఆ భావాలేవి కనిపించకుండా జాగ్రత్తపడుతూ, నవ్వుతూ టీ గబగబ తాగాడు. పిల్లలని నిద్రలేపాడు. బొమ్మ హర్షిత చెంగున లేచింది. సురేష్ మారాం చేశాడు. వాడిని బతిమిలాడి లేపి కూర్చోబెట్టాడు తను. ఇద్దరికీ మొహాలు కడిగించి, పాలు కాచి, చల్లార్చి వాళ్ల చేతుల్లో పెట్టాడు.

తను ఉదయపు టిఫిన్ కోసం ఉల్లిపాయలు తరుగుతున్నాడు. లెక్క

ప్రకారం భర్త పాత్రధారి అయిన చెల్లి ఇప్పుడు కేకలు పెట్టాలి. రెండవ టీ కోసం! కానీ చెల్లి చదువుతున్న పేపర్ పక్కనపెట్టి, లేచి తన పక్కనొచ్చి నిల్చుంది. తనూ ఓ చాకు తీసుకొని వుల్లిపాయలు తరగడం మొదలెట్టింది. తను పోపుకి సిద్ధం చేసుకొనే లోపలే చక్కగా పచ్చిమిరపకాయలు కూడా తరిగిచ్చింది. తను టిఫిన్ చేయడంలో మునిగి వుండగానే పిల్లలని తీసికెళ్లి సాన్నం వగైరా కార్యక్రమాలు పూర్తి చేసేసింది. తను టిఫిన్ టేబిలు మీదికి తెచ్చేలోగా కడిగిన ముత్యాల్లా స్కూలు యూనిఫాంలో ఇద్దరూ సిద్ధం!

అసలు ఆట నియమాల ప్రకారం హర్షిత తన కుర్చీలోంచే కదలకూడదు. నాన్న ఎప్పుడైనా ఇలాటి పనులు చేశాడూ అసలు? హర్షితకి నాన్నలా ఆడడమే చేతకాదు. కోతలు మాత్రం బాగానే కోసింది! అయితే తను హర్షిత ఇప్పుడేం చేసినా కిక్కురుమనకూడదు. లేకపోతే తనకు అమ్మలా చేయడం చెతకాదని వెక్కిరిస్తుంది. అందుకే హర్షిత ఆడిందే ఆట అవుతోంది!

పిల్లలు రెడీ అయ్యారంటే సగంపని అయినట్టే! ఇక క్యారియర్లు సిద్ధం చేయడం, బడికి తయారువడమే పని. తను వంటకి తయారుచేస్తుంటే హర్షిత గ్రైండర్ వేసిచ్చింది. తను వాషింగ్‌మిషన్ వేస్తుంటే హర్షిత బట్టలు పిండి ఆరేసింది. తను బడికి తయారయ్యేలోగా క్యారియర్లు సర్దింది.

తను లోలోపల విజయగర్వంతో నవ్వుకున్నాడు. హర్షిత నాన్నలా చేయడం లేదు. ఎంతయినా అమ్మ కావల్సిందికదా... మరి నాన్నలా చేయడం దాని తరంకాదు. కానీ ఆ మాట హర్షిత ఒప్పుకోదే!

''ఇవ్వాళ పేపర్ చూశావా? మనవాళ్లేదో కప్పు గెలిచారట. బడికి చాలా సమయం వుందిగా. పేపర్ చూడకూడదూ?'' హర్షిత పేపర్‌లోని కొన్ని పేజీలు తనకు అందిస్తూ అంది.

నిజం చెప్పొద్దూ ఇలా ఆడేపనైతే తను అమ్మ అవడానికి ఎప్పుడైనా సిద్ధమే. బోలెడు పనులు చేయనవసరంలేదు. కావలసినంత సమయం. నిక్షేపంగా పేపర్ కూడా తిరగేయొచ్చు. కానీ హర్షితవి ఉత్తి బడాయి మాటలని తేలిపోయింది. నాన్నలా చేయడం దానికి కుదరనే కుదరదు.

''ఛాఁ! నీకు నాన్నలా ఆడడమే చేతకాదు'' చేతిలోని పేపర్ని హర్షిత మీదికి విసిరేశాడు తను.

''లేకపోతే...? నీలాగా ఎప్పుడూ ఒకేలా ఆడాలా? విసుగుపుటేట్టు. అయినా ఎంత సేపని కదలకుండా కుర్చీలో కూర్చుని ఆ పేపర్ని చూడడం? మెడ పట్టేయదా? నడుం పీకుతుంది కూడాను''

నిజమే! అలా కుర్చీలో కదలకుండా కూర్చోవడంవలన నడుంనొప్పి

పుట్టకుండా వుండడానికే తను నాన్నలా నటిస్తున్నప్పుడు హర్షితమీద చిందులు వేయడం! నాన్న కూడా బహుశా అందుకే అమ్మమీద కాసేపటికోసారి ఎగిరెగిరి పడుతుంటాడేమో! కానీ హర్షిత నాన్నలా చేయడం లేదన్నది కూడా పచ్చినిజం.

నాన్న స్కూటర్ వచ్చి ఇంటి ముందాగింది.

అంతే! తామిద్దరూ గబగబా క్యారమ్స్, చైనీస్ చక్కర్ గోళీలు అన్నీ సర్దేశారు. పుస్తకాల సంచులు అరలో పెట్టేసి ఏమీ ఎరగనట్లు ఓ మూల నక్కారు.

నాన్న తడబడే అడుగులతో ఇంట్లోకి వచ్చాడు. పైగా అమ్మ ఈరోజు ఇంట్లో లేదు. ఇలాంటప్పుడు ఏం జరుగుతుందో మా ఇద్దరికీ బాగా తెలుసు.

అందుకే గుండె గొంతులో కొట్టుకుంటుంటే అమ్మ రాబోయే క్షణం కోసం ఇద్దరం బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాం.

అమ్మ రావడం, నాన్న వెటకారంగా ఏవేవో అనడం, చేతికందినవన్నీ అమ్మమీదికి విసిరికొట్టడం, అమ్మ ఏడుస్తూనే పనులు చేసుకోవడం, మమ్మల్ని చూడగానే ఏమీ జరగనట్లే కళ్లు తుడుచుకొని, రాని నవ్వును బలవంతంగా తన పెదాలమీదికి తెప్పించడం. అన్నీ ఎప్పటిలానే జరిగిపోయాయి.

నాన్నంటే ఎలా వుండాలో చూశావా? తను హర్షితవైపు కనుబొమలెగరేసి అన్నాడు. తనే నాన్ననవుతానని హర్షిత ఎప్పుడన్నా అంటే ఈ విషయం గుర్తుచేసి వెక్కిరించేవాడు. ఆటలు పట్టించేవాడు. హర్షిత మాత్రం కుండబద్దలు కొట్టి మరీ చెప్పింది.

''నీ ఇష్టం వచ్చినట్టు నువ్వు ఆడుకో! నేనే నాన్ననయితే అలాగే వుంటానుగానీ ఇలా ఉండను. ఎప్పుడూ నవ్వుతూ...పిల్లలతో ఆడుతూ... ఉంటాను. కొంపలు మునిగిపోయినట్లు మొహం ముడుచుకొని చిర్రుబుర్రులాడుతూ కూర్చోవడం నా వల్ల కాదు''.

''అందుకే నువ్వు నాన్నవవ్వవు అమ్మవే అవుతావు'' తనూ తేల్చి చెప్పేశాడు.

కానీ హర్షిత చాలా గడుసుది. గంతకు తగ్గ బొంతనే పెళ్ళాడింది. చెరొక బ్యాంకులో పనిచేస్తున్నారు. రెండు బ్యాంకుల మధ్యలో ఓ ఇల్లు చూసుకున్నారు.

తనకోరోజు సూర్యంతో పనుండి ఆఫీసు నుంచి నేరుగా వాళ్ళింటికి వెళ్ళాడు. సూర్యం తనెళ్ళేసరికి చంటాడి వుయ్యాల వూపుతున్నాడు. తను బెల్లుకొట్టిన శబ్దానికి వాడు కప్పెగిరేలా ఏడవడం మొదలెట్టాడు.

హర్షిత లోపలనించి ఓ అడుగైనా ఇటు వేయలేదు. తనపని తను దీక్షగా

చేసుకొంటోంది. సూర్యం బాబుని భుజాన వేసుకొని, సముదాయించి, జోకొట్టి పడుకోబెట్టాడు. ఈ కార్యక్రమమంతా తనతో మాట్లాడుతూనే చేశాడు.

తనకు కోపం నసాళానికి అంటుతోంది. హర్షితను కేకేస్తే వాడిని చూసుకోదూ!

హర్షిత బయటికి వచ్చి తనను పలకరించి కట్టింగ్ ట్రేను, చాకును సూర్యం చేతికి ఇచ్చిపోయింది.

హర్షిత ట్రే పట్టుకొస్తోంటే తమతోపాటు కూర్చుని, కూరగాయలు తరుక్కుంటుందేమో అనుకొన్నాడు తను.

సూర్యం ఎంత చక్కగా ఎంత వయ్యారాలుగా ఉల్లిపాయలు తరుగుతున్నాడంటే అసలు అతను ఓ పని చేస్తున్నాడన్న ధ్యాసేలేనట్టుగా తరుగుతున్నాడు.

తనకు ఓ పక్క హర్షితమీద కోపంతో వళ్లు మండిపోతోంది. పైనుంచి ఈ ఉల్లిపాయల ఘాటు. కళ్లు మండిపోతున్నాయి. ధారాపాతంగా కళ్ళల్లోంచి, ముక్కులోంచి నీళ్లు కారాయి.

''మీకు ఉల్లిపాయల ఘాటు సహించదా? అయాం సారీ!'' అంటూ సూర్యం వంటింట్లోకి వెళ్ళాడు.

పది నిమిషాలయినా సూర్యం వంటింట్లోంచి బయటకు రాలేదు.

సూర్యం లోపల ఏం చేస్తుంటాడో చూడాలని ఆ సమయంలో తనకు ఎంత కుతూహలంగా వుండిందో!

గ్రైండర్ వేస్తున్న శబ్దమూ, పకోడీల వాసనా ముందుగదిలోకి ఒకేసారి వచ్చాయి. గ్రైండర్ శబ్దం ఆగగానే సూర్యం బయటకు వచ్చాడు. చేతిలో పకోడీల ప్లేట్లు వున్నాయి.

తను ముందు గదిలో కూర్చుని వున్నాడన్న మాటే కానీ, వంటింట్లోకి వెళ్ళి హర్షితను చెడామడా వాయించేయాలన్నంత ఆవేశంలో వున్నాడు.

ఓ బ్యాంక్ మేనేజరు ఆడదానిలా వంటింట్లో చేరి ఉల్లిపాయలు తరగడమా? చంటాడిని చంకనేసుకొని తిరగడమా? హర్షిత తనమాట సాగుతోందికదా అని ఇలా సాధిస్తోంది. సూర్యం మెత్తదనం చూసుకొని ఇష్టమొచ్చినట్లు ఆడిస్తోంది. అమ్మను, మంజరిని చూసి ఇదేనా నేర్చుకొంది? సూర్యంచేత ఇలాంటి పనులా చేయించేది? తమ ఇంటిపరువు తీసేస్తోంది. అసలు తమ ఇంటి ఆడబడుచు లక్షణం ఒకటైనా వుందా? అమ్మతో కూడా గట్టిగా

చీవాట్లు పెట్టించాలి. సూర్యంతో ఎలా మసలుకోవాలో మంజరితో హితబోధ చేయించాలి. తను గట్టిగా నిశ్చయించుకొన్నాడు. హర్షితతో ఒంటరిగా మాట్లాడే అవకాశంకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఆ అవకాశం హర్షితతో దొరకలేదు కానీ సూర్యంతో దొరికింది.

''మా చెల్లెలికి మరీ చనువిచ్చమాకు సూర్యం!'' అన్నాడు తను.

''ఏ విషయంలో?'' ఏమీ తెలియనట్లే మెత్తగా నవ్వుతూ అడిగాడు సూర్యం.

''హర్షిత నీ మంచితనం చూసుకొని, నువ్వో బ్యాంక్ మేనేజర్‌వి అన్న సంగతి కూడా మరిచి ఇలాంటిపనులు అప్పచెప్పే విషయంలో!'' తను అసహనంగా అన్నాడు.

''నేను ఉల్లిపాయలు తరిగి ఇవ్వకపోతే ఇంత రుచిగల పకోడీలు ఇంత తక్కువ సమయంలో మనముందు వుండేవేనా?'' సూర్యం నవ్వుతూ ఇంకోపకోడి నోట్లో వేసుకొంటూ అన్నాడు.

తను కోపాన్ని బలవంతంగా అణచుకోన్నాడు. తన మొహం చూసి ఏమనుకున్నాడో ఏమో సూర్యం కూడా గంభీరంగా అయ్యాడు. కాసేపు ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

''సురేష్, మీ ఆఫీసులో నీ సబార్డినేట్స్ ఎవరైనా ఆలస్యంగా వస్తే నీకేమనిపిస్తుంది?'' నింపాదిగా అడిగాడు సూర్యం.

''లాగిపెట్టి తన్నాలనిపిస్తుంది. జీతాలు తీసుకోవడానికి ఆలస్యం చేయరు కానీ, ఉద్యోగబాధ్యతలు నిర్వహించడానికి ఆలస్యం...చాలా సులువుగా చేసేస్తారు. ఆడవాళ్ళయితే మరీను. వాళ్ళ నాలిక చివరే సవాలక్ష కారణాలుంటాయి. కదిలించామా నెత్తిమీదే నీళ్ల కడవ''.

''నిజమే! నాకూ అలాగే అనిపిస్తుంది. మరి హర్షితా ఓ ఆఫీసర్‌కి సబార్డినేటే కదా! తను సమయానికి ఉద్యోగానికి వెళ్ళకపోతే...?

సూర్యం ఇలా తిప్పికొడతాడనుకోలేదు తను!

''ఉదయంపూట ఆడవారికి సవాలక్ష కారణాలు కాదు సవాలక్ష పనులుంటాయి. మనం పూచికపుల్ల కదల్చకుండానే ఆఫీసులకి ఆలస్యంగా ఉద్ధరిస్తాం. మరి వాళ్ళు ఆలస్యంగా వస్తే మాత్రం తాండవంచేసి వారినెత్తిన గంగను గుమ్మరిస్తాం. ఒకవేళ మనం వారికి సహాయం చేయడం సంగతి అటుంచి, మన పనులు మనమే చేసుకుంటే...?''

తను మాట్లాడలేదు. ఆపైన ఆలోచించలేక కాదు. ఆలోచించడం ఇష్టంలేక.

''అన్నాయ్ బంటి ఎలా చదువుతున్నాడు? చైత్ర బాగా తగువులకి దిగుతోందా?'' అంటూ హర్షిత వచ్చింది.

హర్షిత చక్కగా స్నానం చేసివుంది. నవ్వు మొహంతో వున్న హర్షితని చూడగానే ఎందుకనో మనసు ప్రశాంతంగా అనిపించింది. ఆ సమయంలో అమ్మ కానీ, మంజరికానీ అలా వుండడం తనెప్పుడూ చూడలేదు.

హర్షిత చాలాసేపు ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పాక, చంటాడు లేవడంతో వాడి పనులు చూడడానికి వాడితోసహా లోపలికి వెళ్ళింది.

తను జేబులోంచి పేక తీశాడు. సూర్యం, తనూ ఎప్పుడైనా అలా కలిసినప్పుడు ఓ రౌండ్ వేయడం అలవాటే. కానీ సూర్యం ఈసారి మృదువుగా తిరస్కరించాడు.

''ఇదేమిటోయ్ సూర్యం కొత్తగా?'' ఆశ్చర్యంగా అన్నాడు తను.

సూర్యం ఎంత చెయ్యితిరిగిన ఆటగాడో తనకు తెలుసు. కాలేజీ రోజుల్లోనే బాగా ప్రసిద్ధి. సూర్యంతో ఆడి, అప్పుల్లో పడకుండా లేవడమంటే గొప్ప విషయమే.

''నేను ఆడడం మానేశాడు సురేష్''

''ఎప్పుడు? ఎందుకు? ఎలా?''

''బుజ్జిగాడు పుట్టాక''

''వేలెడులేడు వాడికోసం నీలోని అంతటి నైపుణ్యానికి నీళ్లు వదిలేస్తావా?'' ఆశ్చర్యం, బాధ కలబోసిన కంఠంతో అడిగాడు తను.

''వాడి కోసమని నేను అబద్ధం చెప్పను. నాకోసమే నేను మానేశాను. నన్ను నేను సంస్కరించుకోవడం కోసమే. ఈరోజు నేను నా దురలవాట్లను మానుకోకపోతే రేపు వాడికి ఏ విషయంలోనైనా తండ్రిగా సలహాలిచ్చే అర్హత కోల్పోతాను'' అన్నాడు సూర్యం.

''అర్హత ఏమిటి? అది తండ్రిగా వాడిపై నీ అధికారం! నువ్వు చెప్పింది వాడు చచ్చినట్టు వినాలి''.

'' ఎందుకు వినాలి? వాళ్ళ ఇష్టాలు, అభిప్రాయాలు వాళ్ళకుంటాయిగా పెద్దవాళ్లుగా రేపు మనం వాళ్లని సరైన మార్గంలోకి మళ్ళించాలంటే అది హఠాత్తుగా బెల్టు విదిలించితే అధికారం చూపితే రాదు. అందుకు మొదట మనమూ సలహా చెప్పే అర్హత సంపాదించి మనమే ఆదర్శంగా నిలబడాలి. నైతికబలం అంటూ వుంటారు చూడు. అది ముఖ్యం ఈనాడు. శారీరకబలం కాదు'' సూర్యం గంభీరంగా అన్నాడు.

హర్షిత కూడా ఇలాగే వాదాలకి దిగుతుంది ఎప్పుడూ.

''మా బ్యాంక్‌వాళ్లు ఫ్లాటుకోసం అప్పిస్తున్నారు. మేం అప్లికేషన్ పెడుతున్నాం. నువ్వూ పెడతావా అన్నాయ్'' లోపలినుంచి హర్షిత ఓ కేకేసింది.

''అంత హఠాత్తుగా అంటే ఎలా? ఆలోచించొద్దూ?'' తన బదులు సూర్యమే సమాధానమిచ్చాడు.

తను ఓ చిన్న నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

''చూడు సురేష్, నాన్న హయాంలోకన్నా ఇప్పుడు మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. జీవనస్థాయి పెరిగింది. నాన్నకన్నా నా పేరు పక్కన డిగ్రీలస్థాయి పెరిగింది. మరలాంటప్పుడు నాన్న కన్నా నా ఆలోచనస్థాయి పెరగకపోతే ఎలా? అరవై ఏళ్ళ క్రితం పుట్టిన నాన్న, వాళ్ళ నాన్న, వాళ్ళ నాన్న, వాళ్ళ నాన్న... ఇలా తరతరాలుగా నాన్నలుగా ఏం చేస్తున్నామో అలాగే ఇప్పుడూ చేయాలంటే ఎలా?'' సూర్యం తనవంకే సూటిగా చూస్తూ అడిగాడు.

తనకి చిర్రెత్తుకొచ్చింది. కానీ, ఎంతయినా బావకదా... కోపం అణచుకొని మర్యాదగా మాట్లాడాల్సివస్తోంది.

''నువ్వేదో పెద్దఘోరం జరిగిపోతున్నట్లుగా అంటున్నావే? అది మన సంప్రదాయం సూర్యం! నువ్వు హర్షిత మాటల్లో మాయల్లో పడి మన సంప్రదాయాన్ని మరిచిపోతున్నావ్.''

తన కంఠంలో ఏ భావం కదలాడిందో తనకే అర్థం కాలేదు.

''కాలాన్నిబట్టి సంప్రదాయాలు మారాలి. మార్పుకోరని సంస్కృతి, మార్పును ఆహ్వానించలేని సంస్కృతి మృతసంస్కృతి. ఇందాక అన్నానే మా ఆర్థికస్థాయి ఇప్పుడు చాలా మెరుగ్గా వుందని.. అందుకు ముఖ్యకారణం హర్షిత ఉద్యోగం'' సూర్యం తన ధోరణిలో తను చెప్పుకుపోతున్నాడు.

''అలాగని నెత్తినెక్కించుకుంటావా?'' చాలా విసురుగా అడిగాడు తను.

సూర్యం ఏమాత్రం చలించలేదు. నింపాదిగా చెప్పుకుపోతున్నాడు. కనీసం తన కోపాన్నన్నా గుర్తించాడా అని అనుమానం వేసింది.

''ఆమెలోని వ్యక్తిని గుర్తించడం నెత్తినెక్కించుకోవడమే అయితే అదిప్పుడు అత్యవసరం సురేష్! ఎందుకంటే కుటుంబంలో భర్తగా, తండ్రిగా మన అస్తిత్వం నిరూపించుకోవాల్సిన సమయం వచ్చేసింది. స్త్రీలు మునుపటిలా కుక్కినపేనులు కారు. ధీమాగా, ధైర్యంగా తమకు కావలసినదేమిటో తేల్చుకుని దానిని సాధించే యుగంలో వున్నారు. ఇది సంధియుగం. సంఘర్షణల యుగం!

మనం మనల్ని సంస్కరించుకోకపోతే వాళ్ల వ్యక్తిత్వపు తేజస్సుముందు మనం మన ఉనికినే కోల్పోయే రోజులు దూరంలో లేవు. ఆ ప్రమాదంలో పడకముందే కుటుంబంలో మన స్థానం ఏమిటి అని ప్రశ్నించుకోక తప్పదు. అహాన్ని కాస్త అణచిపెట్టి ఆరోగ్యకరమైన మార్పులను ఆహ్వానించకా తప్పదు''.

''ఇక నీతో వాదించి...''

''లాభం వుందనే అనుకో! ఇప్పటికే మన అహంతో, అధికారంతో మానవ సంబంధాలలోని రమ్యమైన అనుభూతులెన్నిటినో కోల్పోయాం. అదుగో బూచి అన్నట్లు అదుగో నాన్న అని పిల్లల్ని బెదిరించే స్థానంలో వున్నాం మనం. ఇన్నాళ్లూ కుటుంబ ఆర్థికావసరాలు తీరుస్తున్నామన్న పొగరు మనకు ఉండేది. ఇప్పుడు దాంట్లో సగభాగం ఆడవాళ్లే తీసేసుకున్నారు. వాళ్లు మనతో పోటీపడి, నెగ్గి, సామర్థ్యం నిరూపించుకుంటున్నారు. తరతరాలుగా వాళ్లు పీడితులే! చెల్లియో చెల్లకో మన జులుం సహిస్తూ వచ్చారు. మన నిరంకుశత్వాన్ని ఇంకా ఎంతకాలమని చూపగలం? మనం ఇకనైనా మారకపోతే కుటుంబ వ్యవస్థే సందిగ్ధంలో పడుతుంది. అందుకే అంటున్నాను మనలో మార్పు రావాలని! మామూలు మార్పు కాదు పెనుమార్పు''.

తనకిక వళ్లు మండిపోయింది. ఏదో చెల్లెలుకదా నాలుగు చీవాట్లు పెట్టి దారిలోకి తెద్దామనుకొన్నాడు. అసలాయనకే చీమకుట్టినట్టు లేదు. అయినా వాళ్లెట్లా ఊరేగితే ఇక తనకెందుకు? అతడే అనుభవిస్తాడు! అప్పుడు తెలుస్తుంది అయ్యగారికి! అందుకే తను సూర్యంతో వాదనలకి దిగదలుచుకోలేదు.

ఇంతలో హర్షిత చంటాడిని నిద్రపుచ్చి వచ్చింది. ఆ ఫ్లాటుకు అప్పు ఇచ్చే పథకం గురించి వివరించింది.

తనను సాగనంపడానికి గేటుదాకా వచ్చినప్పుడు సూర్యం అన్నాడు. ''నేను పేకాట నేర్చుకొనేప్పుడు నాన్నలా ఆడగలగాలి అని నేర్చుకున్నాను. నాన్ననే మించిపోయాను. కానీ మానేయాలని అనుకొన్నప్పుడు అమ్మగుర్తొచ్చింది. నాన్న పేకముక్కలు ఓచేత్తో పట్టుకొని, మరోచేత్తో సిగరెట్టు కాలుస్తూండేవాడు. నా మొహాన, చెల్లి మొహాన పొగ రింగులు రింగులుగా వదులుతూ ఆటమెళకువలు బోధించేవాడు. అమ్మకాళ్లావేళ్లాపడి, పిల్లలతో అలాంటి వేళాకోళాలు వద్దని ప్రాధేయపడేది. ఏడ్చి మొత్తుకొనేది. ఆ ఏడుపుకు ఆయన ఏమాత్రం చలించక, ఇంకా రెచ్చిపోయి అమ్మని ఆటలు పట్టిస్తూ తను పగలబడి నవ్వేవాడు. నాకప్పుడది హీరోయిజంగా అనిపించేది. కాని, ఇప్పుడు అదంతా నాన్న తన పైశాచికానందం కోసం చేసిన వికృతచేష్ట అనిపిస్తోంది''

ఇక తను మాట్లాడకుండా స్కూటర్ ఎక్కి వచ్చేశాడు.

ఆ సూర్యాన్ని ఎవరూ బాగుచేయలేరు! బాధగా నిట్టూర్చాడు సురేష్. ఆ సంఘటనను తల్చుకుంటూ, ఇప్పుడు కూడా.

''అబ్బబ్బా... ఇది ఇల్లా కిష్కింధా? వీళ్లు పిల్లలు కారు. వికలాచార్య భూతాలు!'' బంటిగాడు ఓ పొలికేక పెట్టాడు.

సురేష్ ఒక్కసారిగా జ్ఞాపకాల్లోంచి బయటపడ్డాడు. పిల్లలు ఇంకా మమ్మీ డాడీ ఆటలోనే మునిగివున్నారు. 'బంటి అచ్చం తనలానే చేస్తున్నాడే!' సురేష్ మురిపెంగా అనుకొన్నాడు. చైత్ర తన బొమ్మలు రెండింటిని వళ్లో పెట్టుకొని జోకొడుతోంది.

''ఏదో చిన్న పిల్లలు.. వాళ్లు నిద్రపోగానే ఇల్లు సర్దేస్తానులెండి!'' చైత్ర సంజాయిషీ చెపుతున్నట్లు నెమ్మదిగా అంది.

''పిల్లలేంటి పిల్లలు? పిశాచాలు! వాళ్లనట్లా అల్లరిచిల్లరిగా తయారుచేశావ్! ఇంటికి రావాలంటేనే విసుగు పుడుతుంది!'' బంటి చిందులు తొక్కుతూ అంటున్నాడు.

సురేష్‌కి తను రోజూ అర్ధరాత్రిదాకా బయట చేసే ఘనకార్యమేమిటో గుర్తొచ్చింది. సెంటర్లో తన ఫ్రెండ్సందరితోపాటు నిల్చుని గాలి పోగేస్తాడు. టీ తాగుతాడు. ఏ నెయ్యిదోసో, చికెన్‌బిర్యానీనో లాగిస్తాడు. ఇంటికి వచ్చేసరికి మంజరి నిద్ర ఆపుకుంటూ ఎర్రబడిన కళ్లతో వచ్చి, ఇద్దరికీ అన్నం వడ్డిస్తుంది. అప్పుడు ఎందుకోగానీ తను బయట బిర్యానీ తినొచ్చిన సంగతి నోరు తెరిచి చెప్పడానికి నామోషీ అనిపిస్తుంది. చిన్న రాద్ధాంతం చేసి భోజనం తినకుండానే లేచిపోయి హాయిగా పడుకుంటాడు.

మరప్పుడు మంజరి ఏంచేస్తుంది? సురేష్ మొదటిసారిగా ప్రశ్నించుకున్నాడు.

సురేష్ కుతూహలంగా పిల్లలవైపు చూశాడు. చైత్ర మౌనంగా గిన్నెలన్నిటినీ భోజనం చేయకుండానే సర్దేస్తోంది.

బంటి కాలుమీద కాలు వేసుకొని దర్జాగా కుర్చీలో కూర్చుని కేకలు పెడుతున్నాడు. ''ఎప్పుడూ ఏడుపుగొట్టు మొహమొకటి! ఏం చేతయినా చేతకాకపోయినా ఇది చేతనపుతుంది! ఓ ముద్దూ లేదూ ఓ ముచ్చటా లేదూ! ఛ!''

బంటి మంచంమీద పడుకొని గుర్రుపెట్టడం మొదలెట్టాడు. చైత్ర ముక్కు ఎగబీలుస్తూ బొమ్మలమీద చేయివేసి పడుకుంది

రోజూ తను ఇలాగే నిద్రపోతాడు. మరి మంజరి? చైత్రలాగే భోజనం చేయకుండా కన్నీళ్లు దిగమింగి పడుకుంటుందా?

సురేష్‌కి హర్షిత, సూర్యం గుర్తొచ్చారు. వాళ్ళ మొహాల్లోని కొట్టొచ్చే ప్రశాంతత గుర్తొచ్చింది.

చైత్రవంకే చూస్తూవుండిపోయాడు సురేష్.

ఈ పిల్లలు ఇవన్నీ ఎప్పుడు గమనించారు? వాళ్లకి వాళ్ల అమ్మమీద నిజంగానే సానుభూతి వుందా? లేక తన మరుగుజ్జుతనంమీద జాలా?

పిల్లలకి అవన్నీ ఏవీ వుండవు! వాళ్ళు తమలా నటించి ఆట ఆడుకుంటున్నారు అంతే! సురేష్ తనకై తను సమాధానం చెప్పుకున్నాడు.

కానీ ఆ సమాధానంలో ఏదో వెలితి సురేష్‌ని వెక్కిరించింది.

కానీ..కానీ..తనూ, హర్షితా ఆట ఆడుకొనేవారు. అవన్నీ పట్టించుకొనేవారు కూడా!

అమ్మ తమని ఏమీ అనేది కాదు. ఎప్పుడైనా తను మరీ మాట విననప్పుడు మాత్రం 'నువ్వూ మీ నాన్నలా తయారవుతున్నావ్!' అని గొణిగేది..తను దాన్ని ప్రశంసగా తీసుకొనేవాడు.

నిజానికి, తనకూ హర్షితకూ నాన్నంటేనే భయం. ఆయన అక్కడ వస్తున్నాడంటే ఆమడదూరం పారిపోయేవాళ్లు. ఆయనకి బెల్టువీరుడు అని ఓ సంకేతనామం పెట్టుకున్నారు. తామిద్దరూ రహస్యంగా మాట్లాడుకొనేపుడు ఆ మాట వాడేవాళ్ళు.

అమ్మని నాన్నకోప్పడినప్పుడల్లా హర్షిత నాన్నని తన దగ్గర తెగ తిట్టిపోసేది. నిజానికి తనకూ అలాగే అనిపించేది వుత్తిపుణ్యానికి అమ్మమీద ఎందుకలా విరుచుకుపడతాడని! కానీ తనూ ఎప్పటికైనా నాన్న కావలసినవాడు. కనుక హర్షిత మాటలన్నీ తేలిగ్గా కొట్టిపడేసేవాడు. ఇప్పుడు హర్షిత మాటలు చైత్రనోటిలోంచి వినిపిస్తున్నాయి. బంటి అహంకరించే ఆ ఆర్భాటం వెనుక కూడా తనపట్ల అలాంటి భావమే వుందేమో!

సురేష్ పిల్లలిద్దరినీ పరిశీలనగా చూశాడు. ఇద్దరిలో బాల్యపు మిసిమి వుట్టిపడుతోంది. చైత్రవి సోగకళ్ళు. నవ్వితే బుగ్గలు సొట్టలు పడుతున్నాయి. బంటిది వుంగరాల జుట్టు. వాడి మొహానికి బాగా నప్పింది.

ఇన్నాళ్లూ ఇవన్నీ తనకెందుకు కనిపించలేదు! వారి ముద్దుముచ్చట్లను ఎందుకు గమనించలేకపోయాడు? ఆ స్వచ్ఛమైన చిరునవ్వులకు ఎందుకు స్పందించలేకపోయాడు? ముద్దులొలికే ఈ చిట్టిముత్యాలనేనా తను భూతాలు, పిశాచాలు అని తిట్టింది! వాళ్లు కాదు భూతాలు! తనకే ఏదో భూతం

పట్టింది!

''మనల్ని చూడగానే సంబరంగా పరిగెత్తుకొచ్చి, తమ చిన్న చిన్న చేతులతో మన కాళ్లకు చుట్టేస్తారే. అపుడు ఆ చిన్న కన్నుల్లో మెరిసే మిలమిలల ముందు మన అలసటంతా తుడిచి పెట్టుకుపోదూ! ఆ మెరుపులకు మన మానసిక వత్తిళ్లన్నీ మాయమైపోవూ! పిల్లలు పెరిగి, పెద్దయి ఎప్పటికో మనని సంతోషపెడతారనే మనందరి భావన. కానీ పెరిగే పిల్లల స్వచ్ఛమైన భావ ప్రపంచంలోకి తొంగిచూడగలిగితే అంతా ఆనందమే. ఆ రమ్యమైన ప్రపంచంలో స్థానం సంపాదించుకోగలిగితే అంతకన్నా సంతోషకరమైన విషయం ఇంకొకటి వుంటుందా?'' సూర్యం కంఠం ఎక్కడినుంచో అంటోంది.

సురేష్ నెమ్మదిగా లేచి, పిల్లల దగ్గరికెళ్లాడు. పిల్లలు ఉదయపు హంగామా చేస్తున్నారు. సురేష్‌ని చూడగానే ఇద్దరూ దిమ్మెరపోయారు.

బంటి ముందు తేరుకొని అన్నాడు, ''నేనేం అల్లరి చేయట్లేదు డాడీ.. చైత్రే!''

చైత్ర బంటివైపు మిర్రిమిర్రి చూసింది రహస్యంగా!

పిల్లలిద్దరి కళ్లలోని బెరుకును చూడగానే సురేష్‌కి హర్షిత, తనూ నాన్న వస్తున్నాడనడంతోనే ఒక్క పరుగున మూలకు వెళ్లి నక్కడం గుర్తొచ్చింది.

బంటి ఎంత తేలిగ్గా తప్పంతా చైత్రమీదకి తోసేసి తప్పించుకోవాలని చూస్తున్నాడు! ఎంతయినా తన కొడుకు కదా! అయినా వాడి తప్పేంవుంది. తను వాళ్లను దండిస్తాడని ఇద్దరికీ భయమే. అందుకే వాడు సులువుగా అబద్ధం ఆడేశాడు. కానీ తనెప్పుడూ వాళ్ల మీద చేయి చేసుకోలేదే! అయినా అంతటి భయం సృష్టించాడా?

''మనం మన అస్తిత్వాన్ని నిరూపించుకోవాల్సింది అహంకారంతోనో, అధికారంతోనో కాదు. అభిమానంతో!'' సూర్యం తన చెవిలో గుసగుసలాడినట్లుగా తోచింది సురేష్‌కి.

ఇవ్వాళ తనకు అడుగడుగునా సూర్యం గుర్తొస్తున్నాడు ఎందుకో!

సురేష్ వాళ్ల దగ్గరికి వెళ్ళబోయాడు. బంటి చైత్ర సురేష్ వంకే భయంభయంగా చూస్తూ, పెదాలు తడిచేసుకొంటూ వెనక్కు వెనక్కు జరుగుతున్నారు.

సురేష్‌కి పెద్దగా ఏడవాలనిపించింది. తన మీద తనకే అసహ్యం వేసింది.

ఫ! తన కన్నబిడ్డలు! తనపై వారికి ఉండేది కేవలం భయమేనా? ఇంకేం అనుభూతీ లేదా?

సురేష్ సూర్యం మాటలు మననం చేసుకొంటూ, నవ్వుమొహంతో ఇద్దర్నీ ఆప్యాయంగా దగ్గరకు పిలిచాడు. వారు ఆ ఆప్యాయతకు ఎలాంటి స్పందన చూపించలేదు. బిక్కుబిక్కుమంటూ ప్రాణాలరచేతిలో పెట్టుకొని వచ్చినట్టు వచ్చి సురేష్ ఎదురుగా నిల్చున్నారు. వారి పెద్ద పెద్ద కళ్లల్లో బెదురు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సురేష్‌కి వాళ్లిద్దరితో ఎన్నెన్నో చెప్పాలని వుంది. నోరు పెగలడంలేదు.

ఎన్నెన్ని క్షమాపణలు చెప్పుకుంటే తను చేసిన అవమానాలు, అపరాధాలు సమసిపోతాయి? వారినిక నిర్లక్ష్యం చేయనని ఎలా నమ్మించగలడు? తనకూ, వారికీ మధ్య భౌతికంగా ఒక్క అడుగుదూరం కూడా లేదు. కాని తమ మనసులమధ్య పేరుకున్న పరాయిభావం తమను వేలమైళ్ళదూరం నెట్టేస్తోంది. ఆ పరాయిభావం తను వీరి లేత మనసుల్లోంచి తొలగించగలడా?

సురేష్ ఆలోచిస్తూనే వున్నాడు చైల్డ్ ఈజ్‌ది ఫాదర్ ఆఫ్ మ్యాన్ అని మొదటిసారి చదివినప్పుడు ఏమనుకొన్నాడు తను? అర్థంపర్థం లేని మాటలు కాకపోతే పసివాడు ఎదిగిన మనిషికి తండ్రి కావడమేమిటి అనికదా!

తను ఈ పసివాళ్లను నిర్లక్ష్యం చేయడమేకాదు, తనకు తెలియకుండానే తనలోని పసివాడి గొంతు నులిమాడు.

సురేష్ ఎంతసేపటికీ మాట్లాడకపోడంతో చైత్ర ఏంటి సంగతి అన్నట్లు బంటి వైపు తిరిగి సైగచేసింది.

''మీకు ఆకలిగా వుందా?'' ప్రేమగా అడిగాడు సురేష్.

గబగబా తలాడించిన వాళ్లిద్దరి కళ్లనిండా బోలెడు ఆశ్చర్యం, అపనమ్మకం.

సురేష్ వంటింట్లోని డబ్బాలనన్నీ గబగబా వెతికాడు.

''నాన్నా... ఆ వెనక డబ్బాలో మ్యాగీ ప్యాకెట్టు వుంది '' చెపితే ఏమనుకుంటాడో అన్నట్లు చెప్పింది చైత్ర.

సురేష్ ఆ ప్యాకెట్టు, తీసి, దానిమీదరాసివున్న విధానంప్రకారం రెండేరెండు నిమిషాల్లో వండి, ప్లేట్లలో సర్ది పిల్లల చేతికందించాడు. తనూ ఓ కప్పుపాలు వేడిచేసుకొని పంచదార, ఇన్‌స్టంట్ కాఫీపొడి కలుపుకున్నాడు.

సురేష్‌కి నవ్వొచ్చింది. మొత్తం అయిదునిమిషాలన్నా పట్టలేదు. దీనికోసమే తలనెప్పిపుడుతున్నా గంటనుంచి ఎదురుచూస్తున్నాడు. అదీ మంజరిమీద

కారాలు మిరియాలునూరుతూ!

కాఫీ తాగుతూ తనలోతనే నవ్వుకుంటోన్న సురేష్‌వైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు పిల్లలు.

చైత్ర బంటికి సైగచేసింది, ఇవ్వాళ డాడీకి ఏమయిందీ? అన్నట్లుగా.

సురేష్ చైత్ర మొహంలో కదలాడిన భావం చూసి అనుకున్నాడు. పిల్లలు తనకు పిచ్చెక్కిందనుకుంటున్నారేమో!

సురేష్‌కి తెరలు తెరలుగా నవ్వొచ్చింది. ఎందుకు నవ్వుతున్నాడో తెలియకపోయినా పిల్లలిద్దరూ సురేష్ మొహం చూస్తూ నవ్వారు. మంజరి వచ్చి తమతో శృతి కలిపేదాకా అందరూ అలా నవ్వుతూనే వున్నారు.

విపుల మే 1995